# ఖబ్రస్థాన్‌లో పారిశుద్ధ్య పనులు

## పర్యవేక్షించిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** రంజాన్ పండుగను పురస్కరించుకొని స్థానిక ఖబ్రస్థాన్‌లో మున్సిపల్ ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ శుక్రవారం పర్యవేక్షించారు. పండుగ వేళ ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఖబ్రస్థాన్ ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రం చేయిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పిచ్చి మొక్కల తొలగింపు, చెత్తాచెదారం క్లీనింగ్ వంటి పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు జఫార్ సాధిక్ హుస్సేన్, మున్సిపల్ సిబ్బంది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులు, పశువుల దాహార్తిని తీర్చేందుకు చేతిపంపు ఏర్పాటు

## ప్రారంభించిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** స్థానిక అసిఫాబాద్ పెద్ద వాగు బ్రిడ్జి సమీపంలోని మహబూబ్ సుభాని ( జెండాల ) వద్ద భక్తుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన చేతిపంపును శుక్రవారం ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ చేతిపంపును ప్రారంభించారు. పట్టణానికి చెందిన సయ్యద్ మాజీద్ తన స్వంత ఖర్చులతో ఈ బోర్వెల్‌కు చేతిపంపును బిగించి, మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. కేవలం భక్తుల కోసమే కాకుండా, అటుగా వెళ్లే పశువుల దాహార్తిని తీర్చడానికి ప్రత్యేకంగా నీటి కొండిని కూడా ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో సయ్యద్ మాజీద్ చేసిన ఈ పని ఎంతో అభినందనీయమని కొనియాడారు. వేసవి కాలం దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా ఇలాంటి వసతులు కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ జావిద్, మైనారిటీ నాయకులు సయ్యద్ ఆబిద్, సయ్యద్ ఉబెద్, ముబాషిర్, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

# యువతను వంచించిన రాష్ట్ర బడ్జెట్

## ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ యువజన రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందని, ఈ బడ్జెట్‌లో యువతకు 'జీరో' ప్రాధాన్యత ఇచ్చారని ఆయన మండిపడ్డారు. లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌పై స్పష్టత లేకపోవడం, నిరుద్యోగ భృతి ఊసే ఎత్తకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని చిరంజీవి ధ్వజమెత్తారు. కేవలం కాంట్రాక్ట్ ఉద్యోగాలతో యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని, స్కిల్ డెవలప్‌మెంట్ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. క్రీడా రంగానికి కేటాయింపులు నామమాత్రంగానే ఉన్నాయని, గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని, నిరుద్యోగుల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలను ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

## బాలుడిపై పోక్సో కేసు

**ఉద్యమ కెరటం, అశ్వారావుపేట:** భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట పట్టణంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. నాలుగేళ్ల చిన్నారిపై 14 ఏండ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలుడు ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఉగాది సెలవుల సందర్భంగా ఇంటికి వచ్చిన అతడు అదే కాలనీకి చెందిన నాలుగేళ్ల చిన్నారిని ఆడించాలని ఇంట్లోకి తీసుకెళ్లాడు. కొంతసేపటి తర్వాత చిన్నారి ఏడుస్తూ బయటకు రావడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు విషయాన్ని ఆరా తీశారు. దాంతో బాలుడు లైంగిక దాడికి పాల్పడినట్లు బయటపడింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఘటనపై బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు సకల సౌకర్యాలు

- మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడానికి వీలుగా ఈద్గా వద్ద అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ ఆకాష్ , వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ తెలిపారు. శుక్రవారం వారు మున్సిపల్ కమిషనర్ గజానంద్, కౌన్సిలర్ లు చిలువేరు వెంకటేశ్వర్లు, సాలం బీన్ అహ్మద్, మైనార్టీ నాయకులతో కలిసి ఈద్గా ప్రాంగణాన్ని సందర్శించి, జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ రోజున నమాజ్ కోసం వచ్చే వేలాది మంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ యంత్రాంగం తరపున పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున భక్తుల సౌకర్యార్థం ఈద్గా ప్రాంగణమంతా షామియానాలు ఏర్పాటు చేస్తున్నామని, చల్లని తాగునీటి కేంద్రాలను అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. ఈద్గా పరిసరాలను మున్సిపల్ సిబ్బందితో పూర్తిస్థాయిలో శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు అవసరమైన చోట చదును చేయిస్తున్నామని వివరించారు. ముస్లిం సోదరులందరూ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, మున్సిపల్ పాలకవర్గం మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా మస్జీద్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, నాయకులు సయ్యద్ అన్సర్, నిసార్, అబ్దుల్ రహమాన్, సమద్ సయ్యద్, అమర్ బీన్ అహ్మద్, జవిద్, షబ్బీర్ , సల్మాన్ ఖాన్ , మతిన్ , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువజన రంగానికి అన్యాయం చేసిన తెలంగాణ బడ్జెట్

- నిరుద్యోగ యువతకు న్యాయం ఎక్కడ..?
- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు,
- వలి ఉల్లా ఖాద్రీ



**ఉద్యమ కెరటం , వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో నేడు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ లో యువజన రంగానికి తీవ్రమైన అన్యాయం జరిగిందని, యువతపై ప్రభుత్వానికి బాధ్యత లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఈ బడ్జెట్ ను అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగం, విద్య పూర్తిచేసిన యువతలో ఉన్న ఆందోళనలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. యువజనానికి జీరో ప్రాధాన్యం – బడ్జెట్‌కు జీరో న్యాయం చేశారని ఏద్దేవా చేశారు. లక్షలాది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలపై స్పష్టత లేదని, నిరుద్యోగ భృతి పై ఒక్క మాట లేదని, కాంట్రాక్ట్ ఉద్యోగాలతో యువత భవిష్యత్తు నాశనం అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీలు ఉన్నా అవకాశాలు లేవని, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు అంటూ పరిమిత స్థా యిలో నిధులను దుర్వినియోగం చేస్తున్నారని దీనిలో యువత భాగస్వామ్యం పూర్తిగా లేదని వారు ఆరోపించారు.రాజీవ్ యువ వికాశ పథకం అధికార పార్టీ కార్యకర్తల పథకమని వారు విమర్శించారు. విద్య ఇచ్చి ఉద్యోగం ఇవ్వకపోతే ఆ విద్యకు అర్థం ఏమిటి అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ పై స్పష్టత లేదని, యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో నిరుద్యోగం అత్యంత కీలకమైనదన్నారు. చదువు పూర్తిచేసుకున్న లక్షలాది యువత ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. అయితే నియామకాలలో ఆలస్యం, స్పష్టతలేమి, వాయిదాలు యువతలో నిరాశను పెంచుతున్నాయని . ఈ పరిస్థితిలో ప్రభుత్వం బడ్జెట్ లో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. జాబ్ క్యాలెండర్ అంటే ఒక సంవత్సరంలో ఏ శాఖలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నారు, నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుంది, పరీక్షలు ఎప్పుడు జరుగుతాయి, ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారు అనే పూర్తి సమాచారాన్ని ముందుగానే ప్రకటించడం. ఇది యువతకు దిశానిర్దేశం చేసే మార్గదర్శక పథకంలాంటిది. ఈ బడ్జెట్ యువతను తీవ్ర నిరాశజనకమని అందుకే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువత హక్కుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# నూతన జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శులకు సన్మానం



**ఉద్యమ కెరటం, సొనాల:** సొనాల మండల కేంద్రానికి చెందిన లోలపు పోశెట్టి, చౌహాన్ హరిసింగ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శులుగా ఎన్నిక కావడంతో మండల కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శులు లోలపు పోశెట్టి, చౌహాన్ హరి సింగ్ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గడపకు చేర్చడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, జిల్లా కాంగ్రెస్ కమిటీలో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందన్నారు. తమను ఈ పదవులకు ఎంపిక చేయడంలో సహకరించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్, రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్, ఆదిలాబాద్ ఇంచార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సోయం బాపురావు, రాథోడ్ బాపురావు తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ బోథ్ నియోజకవర్గ అధ్యక్షుడు జుంగాల భోజన్న, సొనాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్, చింతల్ బోరి సర్పంచ్ శ్రీరామ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడాల శేఖర్, తుల అజయ్, విజయ్ భాస్కర్ రెడ్డి, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు మహమూద్, సుధీర్ కుమార్, నరేందర్, సుదర్శన్, ప్రకాష్, శ్రీనివాస్, గంగాధర్, సోమన్న, భీంరావు, రాజారాం, ప్రతాప్ సింగ్, లోక నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా సోమిరెడ్డి



**ఉద్యమ కెరటం, వేంసూర్:** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా వేంసూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పుచ్చకాయల సోమిరెడ్డి నియమితులయ్యారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టు బడి పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఆయనకు ఈ పదవి లభించడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన కాంగ్రెస్ అగ్రనాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, నాయకుల మార్గదర్శకత్వంలో కార్యక ర్తలను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ గృహ ప్రవేశం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో డాంగ్రే వనిత రమేష్ దంపతుల ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి శుక్రవారం ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి హాజరయ్యారు. పూరి గుడిసేలో ఉన్న పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించిన మహోన్నత వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కొనియాడారు. అలాగే లబ్దిదారుల ఇళ్ల మంజూరుకు ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి కృషిని ప్రశంసించారు. నూతన ఇంట్లో ఆనందం, ఐశ్వర్యం నిండాలని, కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తమ్మల చందు, భూపేందర్, సాయి, అజయ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# గోదావరిలో విషాదం



- ఐదుగురు బీటెక్ విద్యార్థు లు గల్లంతు

**ఉద్యమ కెరటం, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పరిధిలోని గోదావరి నదిలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఉగాది సెలవుల సందర్భంగా స్నేహితులతో కలిసి నదిలో స్నానానికి దిగిన ఐదుగురు బీటెక్ విద్యార్థులు గల్లంతయ్యారు. వివరాల ప్రకారం.. అమరావతిలోని ఎస్ఆర్ఎంటీ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, భద్రాచలం ప్రాంతానికి చెందిన మిత్రులు అభిరామ్, శ్రీకర్‌లతో కలిసి ఎటపాక మండలం పురుషోత్తమపట్నం గ్రామానికి చెందిన కొల్లిగూడెం ఇసుక ర్యాంప్ సమీపంలోని గోదావరి నదిలోకి దిగారు. ఫోటోలు తీసుకుంటూ ఉండగా అకస్మాత్తుగా ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఈ ఘటనలో ఏడుగురు యువకుల్లో ఇద్దరు ఈత రావడం ద్వారా ఒడ్డుకు చేరుకున్నప్పటికీ మిగిలిన ఐదుగురు అభిరామ్, శ్రీకర్, తేజ, సతీష్, నవదీప్ గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు ప్రారంభించారు. ప్రత్యేక రెస్క్యూ బృందం మృతదేహాల కోసం గాలిస్తోంది.

# జనగణన ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**• జిల్లా కలెక్టర్ రాజర్షిషా**




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జనగణన ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వ హించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక టీటీడీసీలో సెన్సస్–2027 (జనగణన)పై టెక్నికల్ అసిస్టెంట్లు, ఛార్జ్ క్లర్కులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న జనగణన ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ సెన్సస్ ప్రక్రియను పూర్తిగా డిజిటల్ పద్ధతిలో నిర్వహిస్తున్నామని, ఇందుకోసం సెన్సస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ వంటి ప్రత్యేక యాప్‌లు, పోర్టల్స్ అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కింద ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ కింద మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో ఇళ్ల జాబితా నమోదు ప్రక్రియను చేపడతారని తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఆన్‌లైన్ ద్వారా ఎన్యూమరేటర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించి, ప్రతిరోజూ తహశీల్దార్లకు నివేదికలు అందించాల్సి ఉంటుందని సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని, ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో పక్కాగా సర్వే జరగాలని ఆదేశించారు. ఎన్యూమరేటర్ల మధ్య పని విభజన సమానంగా ఉండాలని, ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, పర్యవేక్షకురాలు నలందప్రియ, మాస్టర్ ట్రైనర్లు వినయ్, జగన్, శ్రీహరి, ఇతర అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# టీబీ ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో స్థా నిక మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఝాన్సిరాణి, డాక్టర్ లక్ష్మి ప్రసన్న ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు క్షయ వ్యాధి నివారణ, హెచ్ఐవీ వ్యాధిపై ప్రజలకు వివరించారు. రెండు వారాలకు పైగా దగ్గు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలని సూచించారు. హెచ్ఐవీ వ్యాప్తి నివారణకు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పోస్టర్లను విడుదల చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా తెమడ పరీక్షలు, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తున్నామని, క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచిత చికిత్సతో పాటు చికిత్స కాలం వరకు ప్రతినెల రూ.వెయ్యి పోషణ భత్యం అందిస్తున్నామని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి క్షయ వ్యాధి త్వరగా సోకే ప్రమాదం ఉంటుందని, పోషకాహారం తీసుకోవడం అవసరమని సూచించారు. సకాలంలో నిర్ధారణ చేసి చికిత్స ప్రారంభిస్తే వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి వివిధ పరీక్షలు నిర్వహించారు. 21 మందికి తెమడ పరీక్షలు చేయగా, 84 మందికి పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా వారి నివాస ప్రాంతాల దగ్గరే ఎక్స్‌రే పరీక్షలు జరిపారు. జనరల్, స్త్రీ, పిల్లల, కంటి, ఎముకల వైద్య నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, వార్డు సభ్యులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పుట్ట సత్తయ్య, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, డివిజన్ టీబీ సూపర్వైజర్ శ్రీపెల్లి శశికాంత్, ఐసీటీసీ కౌన్సిలర్ జగన్మోహన్, హెల్త్ సూపర్వైజర్, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎక్స్‌రే టెక్నీషియన్, ఆశ కార్యకర్తలు, ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రంజాన్ సందర్భంగా పేదలకు రేషన్ కిట్ల పంపిణీ



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గంభీరావుపేటలో సిద్దిపేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు రేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు వంద కుటుంబాలకు అవసరమైన రేషన్ కిట్లు అందజేశారు. స్థానిక ముస్లిం ఫంక్షన్ హాల్‌లో ఫౌండేషన్ కన్వీనర్ మహమ్మద్ లాయిక్ మోహినొద్దీన్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మహమ్మద్ లాయిక్ మాట్లాడుతూ రంజాన్ నెలలో పేదలకు సహాయం చేయడం ప్రతిఒక్కరి బాధ్యత అని తెలిపారు. సిద్దిపేట ఫౌండేషన్ గత కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో బలహీన వర్గాలకు అండగా నిలుస్తోందని చెప్పారు. ఫౌండేషన్ స్థాపకుడు సాదత్ నజీర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాల ద్వారా పేదల ముఖాల్లో ఆనందం చూడడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జామే మస్జిద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ మహబూబ్ అలీ, మాజీ వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ అస్లమ్, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ జుబేర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీదుద్దీన్ ఖాలిద్, జామే మస్జిద్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్ అలీ సాదత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో బోరంచు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లింల కోసం శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఖానాపూర్‌లో ఉన్న జోహరా మస్జిద్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్‌తో కలిసి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. పండ్లను అందజేసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. రంజాన్ పండుగను స్నేహ సంబంధాలతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫహీమ్, డాక్టర్ గౌస్, అలీమ్, అయ్యూబ్, చోటూ, నజీజ్, ముర్తుజా, అజీజ్, అఫ్సర్ ఖాన్, శివాజీ కాంబ్లే తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** యువతులు, మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇంచార్జి ఏఎస్సై సునిత అన్నారు. జిల్లా ఎస్పీ నితిక పంత్, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 100 వినియోగం, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై వివరించారు. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని, ఎలాంటి వేధింపులు ఎదురైన వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. సమస్యలు ఎదురైనపుడు కాగజ్‌నగర్ షీటీం నం.8712670565కు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.శ్రీదేవి, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు బి.రమాదేవి, శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో అన్నదానం

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న దర్గాలో ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కందూరు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ముస్లిం సోదరులకు అన్నదానం నిర్వహించి భక్తులకు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలో అన్నివర్గాల ప్రజలు ఐక్యమత్యంతో, సఖ్యతతో జీవించాలని, సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని ప్రార్థించారు. అలాగే పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆరోగ్యంతో, సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జామ మస్జీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ మహబూబ్ అలీ, మాజీ జెడ్పీటీసీ మల్లుగారి నర్స గౌడ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నియోజకవర్గంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన మోరంపుడి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన బీమా లక్ష్మయ్య కూతురు ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పెనుబల్లి మండలం కొర్లగూడెం గ్రామానికి చెందిన కొప్పుల వెంకటస్వామి మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## భద్రాచల రాములోరి కల్యాణానికి సీఎంకు ఆహ్వానం



**ఉద్యమ కెరటం, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామ నవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ బ్రహ్మోత్సవాలు ఈనెల 19 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఈనెల 27న జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా దేవాదాయ శాఖ ప్రతినిధులు, ఆలయ అర్చకులు ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమ నరేందర్ రెడ్డి, తదితర ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈవో దామోదర్ రావు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గిరిజన సురక్ష మంచ్ ఆధ్వర్యంలో మే 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న “చలో ఢిల్లీ” కార్యక్రమాన్ని గిరిజనులు, ఆదివాసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని లఖంపూర్ సర్మేడి ఆత్రం గంగారాం పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం మారిన గిరిజనులను షెడ్యూల్ తెగల జాబితా నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఆదివాసీ పటేల్‌లు, యువత, మహిళలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్మేడి ఆత్రం సోనేరావు, లఖంపూర్ సర్పంచ్ సెడ్మాకి గంగాధర్, తోడషం శంకర్, రోల్ మామడ మాజీ సర్పంచ్ కోర్టికల్ ఆత్రం నగేష్, కుంటాల సర్పంచ్ గంగారాం, నాగమల్యాల గోడం అమృత్ రావ్, కనక అమృత్, యాపల్ గూడా పటేల్ మండాడి భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్థి వ దేహానికి నివాళులర్పించిన ఆడే గజేందర్

**ఉద్యమ కెరటం, సొనాల:** సొనాల మండలంలోని కోట(కె) గ్రామానికి చెందిన డాక్టర్ శంకర్ కుమారుడు అనారోగ్యంతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ గ్రామానికి చేరుకుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుడి పార్థి వ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గజేందర్ మాట్లాడుతూ యుక్త వయసులో కుమారుడిని కోల్పోవడం డాక్టర్ శంకర్ కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఈ విషాద ఘటన కుటుంబ సభ్యులను తీవ్ర శోకసంద్రంలో ముంచిందని పేర్కొన్నారు. ఇలాంటి కష్టసమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ తర పున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థా నిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**ఉద్యమ కెరటం సత్తుపల్లి:** నకిలీ విత్తనాలsy నష్టపోయిన సిద్ధారం సదాశివపేట రేజర్ల రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ కోరారు. వెంకటరమణ సీడ్స్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని, ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీడ్ కంపెనీ రైతులకు ఇచ్చిన విత్తనాలు నాసిరకంగా ఉండటంతోనే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో వరి పంట లేక రైతులు ఆందోళన పడుతున్నారని తెలిపారు. సదరు సీడ్ కంపెనీ యాజమాన్యం రైతులను పట్టించుకోకపోవడం శోచనీయమని విమర్శించారు. సిపిఐ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కోణంనేని సాంబశివరావు ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామని

